పార్టీ ఆదేశాల మేరకే
నడుచుకున్నాం..

● 'మీర్‌పేట్' అవిశ్వాసం విషయంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు

సరూర్‌నగర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం విషయంలో తాము తమ పార్టీ హైకమాండ్ ఆదేశాలకు కట్టుబడి నడుచుకున్నామని కాంగ్రెస్ సభ్యులు చల్లా కవితాబాల్‌రెడ్డి, సిద్దాల మౌనికాశ్రీశైలం స్పష్టం చేశారు. మేయర్‌పై అవిశ్వాసం అంకంలో ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, వాటిపై మీడియాలో వస్తున్న కథనాలపై వారు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కొందరు నాయకులు కావాలనే తమను అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నారని అన్నారు. అసలు అవిశ్వాస తీర్మానంపై తాము సంతకాలు కూడా చేయలేదని పేర్కొన్నారు. తమ పార్టీ సభ్యులకు రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి జారీ చేసిన షోకాజ్ నోటీసుల్లోని ఆదేశాలకు కట్టుబడి తాము అవిశ్వాసంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి గైర్హాజరైనట్టు వారు స్పష్టం చేశారు. తాము ఏ ఒక్క రోజు కూడా అవిశ్వాసానికి మద్ధతిస్తామని చెప్పలేదని వారు గుర్తు చేశారు. అసలు బీజేపీ మేయర్ అభ్యర్థి కాంగ్రెస్‌లోకి వస్తారనే గ్యారంటీ ఏముందని వారు ప్రశ్నించారు. తమకు పార్టీ ముఖ్యమని, పదవులు ముఖ్యం కాదని అన్నారు. మీర్‌పేట్‌లో మేయర్, డిప్యూటీ మేయర్ ఇద్దరూ బీఆర్‌ఎస్‌కు చెందిన వారే ఉన్నప్పుడు.. అవిశ్వాసం ఇద్దరిపై కాకుండా ఒక్క మేయర్‌పైనే పెట్టడంలోని అంతర్యమేమిటో ఆ సభ్యులకే తెలియాలని వారు వ్యాఖ్యానించారు. మరోసారి తమను అప్రతిష్టపాలు చేయాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదని వారు హెచ్చరించారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ నేత



దీపాదాస్ మున్షీ, మధుయాష్కీగౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన గుర్రం చంద్రశేఖర్

చంపాపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం మాజీ డైరెక్టర్ గుర్రం చంద్రశేఖర్ శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీ, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరిగి తాను సొంతగూటికి రావటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు కోటగిరి శ్రీనివాస్‌గౌడ్, చేగోని అశోక్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో గణపతి హోమం



గణపతి మూలమంత్ర హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కొత్తపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్నేహపురి గోదా సమేత పద్మావతీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని విజయ గణపతి ఆలయంలో శుక్రవారం గణపతి మూల మంత్ర హోమం నిర్వహించారు. అర్చకస్వాములు మహంకాళి రవి, జగదీష్ స్వామి శాస్త్రోక్తంగా, వేద మంత్రాలతో హోమం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వారణాశి వంశీ, కార్యదర్శి ప్రసన్నకృష్ణ, కోశాధికారి హేమసుందర్‌రావు, ట్రస్టీ అనంతుల సురేందర్‌రెడ్డి, మేనేజర్ రవి కుమార్ ఏర్పాట్లు చేశారు. స్నేహపురి కాలనీ, పరిసర కాలనీల ప్రజలు హోమం, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



రంగస్థల నటుడు మల్లాది గోపాలకృష్ణను సత్కరిస్తున్న జస్టిస్ బి.చంద్రకుమార్

కళాకారులను కాపాడుకోవాలి..

● హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్

వనస్థలిపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. వనస్థలిపురం డివిజన్ హిల్ కాలనీలో ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ రంగస్థల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నాటకం ఎంతో ప్రాచీన కళా రూపమనీ, ప్రపంచ వ్యాప్తంగా ప్రతిరోజూ విభిన్న కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, తెలుగు విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ మల్లాది గోపాలకృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆకృతి సుధాకర్, పి.కృష్ణాదిశేషు, చేపూరి శంకర్, పవన్ కుమార్ పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

పంజాగుట్ట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చాలని బోయ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మీనగ గోపీ బోయ డిమాండ్ చేశారు. సమితి ఆధ్వర్యంలో శుక్రవారం హలో వాల్మీకి.. చలో హైదరాబాద్ పేరుతో మేధావులు, డీఎస్‌టీ, ఎంబీసీ, బీసీ కుల సంఘాల ప్రతినిధులతో కలిసి శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మేదోమధన సదస్సు ఏర్పాటు చేశారు. తమ సామాజికవర్గం ఇతర రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ జాబితాలో ఉండగా తెలంగాణలో బీసీ జాబితాలో ఉందని, వెంటనే వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని గోపీ అన్నారు. తమకు ఒక ఎమ్మెల్సీ, ఎంపీ పదవి ఇవ్వాలని, కుల వృత్తి లేని వారిని ఆదుకోవాలని, తాము ఆర్థికంగా ఎదగడానికి బోయ బంధు పథకం ప్రవేశపెట్టాలన్నారు. గద్వాల్‌లో ప్రత్యేక గురుకులాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో సామాజిక న్యాయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, బీసీ సేన అధ్యక్షుడు బి.కృష్ణయాదవ్, సమితి ఉపాధ్యక్షులు జి.రాజేశం, పి.అంజయ్య, ప్రధాన కార్యదర్శి బోగె చందర్ రావు, జి.యాదయ్య, నరేష్, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

సైదాబాద్‌లో దారిదోపిడీ

● వృద్ధుడి మెడలో రెండు తులాల బంగారు గొలుసు చోరీ



గాయపడ్డ వ్యాపారి ప్రకాశ్

సైదాబాద్, మార్చి29 (ఆంధ్రజ్యోతి): ఆటో కోసం వేచి ఉన్న ఓ వృద్ధుడి మెడలోని రెండు తులాల బంగారు గొలుసును ఆగంతుకులు తెంపుకొని పారిపోయారు. స్థానిక యువకులు గమనించి వారిని వెంబడించినా ఫలితం దక్కలేదు. మాదన్నపేట సాయిలాల్‌తోటకు చెందిన బూరుగ్ల ప్రకాశ్ గౌడ్(61) వెల్డింగ్ పనులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం సైదాబాద్ శంకేశ్వర్ బజార్ ప్రధాన రహదారిపై ఉన్న పెట్రోల్ బంకు వద్ద ఇంటికి వెళ్లేందుకు ఆటో కోసం వేచి ఉన్నాడు. ఇంతలో ఓ ఆటో వచ్చి ఆగింది. డ్రైవర్ పక్కన 30-40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి, వెనుక సీటులో మరొకరు కూర్చుని ఉన్నారు. ముందు సీట్లోని వ్యక్తి ప్రకాశ్ మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును లాకున్నాడు. ప్రకాశ్ వెంటనే స్పందించి ఆగంతుకుడిని చొక్కా కాలర్ పట్టుకున్నాడు. దీంతో అతను కాలితో బలంగా తన్నడంతో ప్రకాశ్ రోడ్డుపై పడిపోయాడు. అతనికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న శ్రీకాంత్, మనోహర్ అనే ఇద్దరు యువకులు ఈ సంఘటనను గమనించి పారిపోతున్న ఆగంతుకుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా వారు ఆటోలో పారిపోయారు. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయాలి

● మార్నింగ్ వాక్‌లో మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



వాకర్స్‌తో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

మన్సూరాబాద్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి గులాబీ జెండాను ఎగురవేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, బీఆర్‌ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి మన్సూరాబాద్ డివిజన్ హరిణ వనస్థలిలో వాకర్స్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వాకర్స్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపునకు తన వంతుగా కృషి చేస్తామన్నారు. పార్కులో ఉన్న యోగ షెడ్డును వెడల్పు చేయాలని, ఓపెన్ జిమ్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు అన్నీ పరిష్కరించామని, మిగిలిన వాటిని కూడ త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే నాగోల్ నుంచి ఎల్‌బీనగర్ వరకు ఎల్ బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు మెట్రో నిర్మాణం పూర్తి చేసే విధంగా ప్రభుత్వంపై వత్తిడి తెస్తామని ఆయన పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఆశీర్వదించినట్లే మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలనీ ఎమ్మెల్యే కోరారు. రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధిని సాధించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి గద్దెను ఎక్కి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. ప్రతి ఒక్కరూ తనకు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, నాయకులు అనంతుల రాజిరెడ్డి, చెరుకు ప్రశాంత్‌గౌడ్, డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, చిరంజీవి, ప్రమీల, జగదీశ్ యాదవ్, సతీష్ యాదవ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



ముసారాంబాగ్ బేతనియా బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ఆరాధన

చాదర్‌ఘాట్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): శుభ శుక్రవారం సందర్భంగా ముసారాంబాగ్ బేతనియా బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. పాస్టర్ రెవరెండ్ సామ్యూల్‌బాబు బైరపోగు ముందుగా ప్రత్యేక ఆరాధనలు ప్రారంభించగా రెవరెండ్ దేవేంద్రప్ప వీరపురం, తేజస్వి ప్రసాద్‌రెడ్డి ప్రొగు, డాక్టర్ సునీతభాను, రెవరెండ్ సైలస్ రెజినాల్డ్ బైరపోగు, జాన్ మోజెస్ కోడూరు, సుధీర్‌కుమార్ బండారు, రెవరెండ్ రమేష్ బాబు ధ్యానం చేయించారు.

మునగనూరులో

హయత్‌నగర్ : మునగనూర్ షెకీనా ఫెలోషిప్ చర్చిలో చర్చి వ్యవస్థాపక అధ్యక్షుడు చింతల ఇషాకర్ ఆధ్వర్యంలో క్వయర్ బృందం సభ్యులు క్రీస్తు ఈ కార్యక్రమంలో ప్రసన్నతో పాటు పలువురు పాల్గొన్నారు.



భక్తి గీతాలను ఆలపిస్తున్న క్వయర్ బృందం సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్ట్ చర్చిలో...

దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్ట్ చర్చిలో శుభ శుక్రవారం ఆరాధనలు రెవరెండ్ శాంత కుమార్ ఆధ్వర్యంలో జరిగాయి. చర్చి కమిటీ అధ్యక్షుడు ఇజ్రాయిల్, సభ్యులు నవీన్, కె.బాబుతోపాటు పలువురు ప్రత్యేక ఆరాధనలో పాల్గొన్నారు.

లింగోజిగూడలో

ఎల్‌బీనగర్: లింగోజిగూడలోని బేతల్ చర్చిలో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి భక్తిగీతాలు ఆలపించారు. ఈ వేడుకల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దిల్‌సుఖ్‌నగర్‌లోని బాప్టిస్ట్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ శాంతకుమార్

గణితశాస్త్రంలో ఖాసీం అలీకి డాక్టరేట్



రామంతాపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గణిత శాస్త్రంలో సమర్పించిన పరిశోధన పత్రానికిగాను రామంతాపూర్‌కు చెందిన ఖాసీం అలీకి జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. న్యూమరికల్ స్టడీ ఆఫ్ హైబ్రిడ్ నానో ఫ్లూయిడ్ ఇన్ కోయిటి ఫ్లో అనే అంశంపై సమర్పించిన పరిశోధన పత్రానికి ఖాసీం అలీకి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ ఎ.అరుణ కుమారి, రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఖాసీం అలీని పలువురు అభినందించారు.

శ్రీరామశర్మకు జేఎన్‌టీయూ పీహెచ్‌డీ



శ్రీరామశర్మ

హైదరాబాద్ సిటీ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జీవీఎస్ఎస్ఎన్ శ్రీరామశర్మకు జేఎన్‌టీయూ నుంచి డాక్టరేట్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ)పట్టా లభించింది. 'డేటా ఎనలిటిక్స్‌ను ఉపయోగించి ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణను అంచనా వేయడం' అంశంపై శ్రీరామశర్మ ఆరేళ్ల పాటు పరిశోధన చేశారు. యూనివర్సిటీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డాక్టర్ రవీంద్రనాథరెడ్డి, సీపీఆర్ఐ మాజీ డైరెక్టర్ ప్రదీప్ మార్గదర్శకత్వంలో శ్రీరామశర్మ తన పరిశోధనను పూర్తిచేశారు. ఈ మేరకు జేఎన్‌టీయూ పరీక్షల విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎ.అరుణకుమారి నోటిఫికేషన్ జారీచేశారు. ఈ సందర్భంగా శ్రీరామశర్మ మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి ప్రిడిక్టివ్ మెయింటెనెన్స్ ద్వారా ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్‌ను అంచనా వేయవచ్చన్నారు. వైఫల్య సమయాన్ని ముందుగా అంచనా వేయడం ద్వారా ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటెనెన్స్‌ను షెడ్యూలు చేసేందుకు ప్లాన్ చేసుకోవచ్చన్నారు. ఇన్వెంటరీ మెయింటెనెన్స్ ద్వారా వాటి ట్రాన్స్‌ఫార్మర్ల జీవిత కాలాన్ని పొడిగించేందుకు తన పరిశోధన దోహదపడనుందని పేర్కొన్నారు. శ్రీరామశర్మను కళాశాల యాజమాన్య ప్రతినిధులు, సహచర అధ్యాపకులు అభినందించారు.

భవిష్యత్తు దర్శనం చేసే రచనలు చేయాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ ఇనాక్ తదితరులు

చిక్కడపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సాహితీవేత్తలు వర్తమాన సంఘటనలపై స్పందించడమే కాక భవిష్యత్తు దర్శనం చేసే రచనలు చేయాలని వేంకటేశ్వరయూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ఆచార్య కొలకలూరి మధుజ్యోతి రచించిన ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యసృష్టి దృష్టి గ్రంథావిష్కరణసభ శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇనాక్ గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మధుజ్యోతి ఏడు ప్రక్రియలపై లోతైన అధ్యయనం చేసి పరిశోధనకు సరిపడా విశ్లేషణ తన గ్రంథంలో చేశారని అభినందించారు.

గ్రంథరచయిత మధుజ్యోతి మాట్లాడుతూ.. ఇనాక్ సాహిత్యం సమస్తం ప్రేమతత్వంతో ముడిపడి ఉంటుందన్నారు. స్త్రీ హక్కులు స్వేచ్ఛ గురించి ఎవరూ మాట్లాడని రోజుల్లో ఐదు దశాబ్దాల కిందటే ఇనాక్ తనసాహిత్యంలో వాటి గురించి ప్రస్తావించారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, చక్రపాణి, గుండవరపు గీతాదేవి, ప్రొఫెసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్థల ఆక్రమణలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

● బీజేపీ నేతలు

సైదాబాద్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ ప్రధాన చౌరస్తాలోని జైళ్ల శాఖ స్థలం ఆక్రమణలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్, కుర్మగూడ డివిజన్ నాయకుడు బండ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మాదన్నపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జైళ్లు, పోలీస్ శాఖ నిర్లక్ష్యం వల్ల కోట్లాది రూపాయల విలువ ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురయితే చర్యలు తీసుకోకపోవడం దారుణమని అన్నారు. ప్రభుత్వం స్పందించక పోతే ఏప్రిల్ 5న సైదాబాద్ చౌరస్తాలో ధర్నా చేపడుతామని హెచ్చరించారు. ఈ ఆక్రమణలపై లోకాయుక్తలో ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు.

కుటుంబ కలహాలతో ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్ ఉద్యోగి ఆత్మహత్య

అల్వాల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబ తగాదాల కారణంగా హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. అల్వాల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ ప్రాంతానికి చెందిన ప్రహ్లాద్ కుమార్(40)కు అదే ప్రాంతానికి చెందిన శుభశ్రీతో వివాహం అయింది. వీరికి ఒక బాబు. ప్రహ్లాద్‌కుమార్ కొన్నేళ్లుగా హకీంపేట ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తూ అక్కడే క్వార్టర్స్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వీరికి ఫ్యామిలీ కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. అయినా గొడవపడుతున్నారు. గురువారం రాత్రి దంపతులు ఇద్దరూ గొడవపడ్డారు. మనోవేదనకు గురైన ప్రహ్లాద్‌కుమార్ రాత్రి 11.30 గంటల సమయంలో ఇంట్లో బెడ్‌రూమ్‌లో ఉరేసుకున్నాడు. హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెడ్డి, వైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్‌ల చైర్మన్లుగా
మహిళలను నియమించాలి

బర్కత్‌పుర, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన ఈబీసీ బోర్డుతోపాటు రెడ్డి, వైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్‌లకు చైర్మన్‌లుగా ఆయా వర్గాలకు చెందిన మహిళలను నియమించాలని ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం. భాగ్యలక్ష్మి కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లో ఓబీసీ కార్యాలయంలో రెడ్డి కార్పొరేషన్ సాధన కోసం పోరాటం చేసి విజయం సాధించిన లతారెడ్డిని సత్కరించారు. జాతీయ బీసీ మహిళా సమాఖ్యకు లతారెడ్డి అధ్యక్షురాలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. రెడ్డి, వైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్‌ల సాధనకు ఎంతో మంది మహిళలు పోరాటం చేశారని, వారిని గుర్తించి పాలక మండలి చైర్మన్‌లుగా నియమించాలని, అప్పుడే వారికి న్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఓబీసీ సెంట్రల్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



నందనవనంలో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వై.వెంకటగాంధీ

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

చంపాపేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ నందనవనంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. టీడీపీ డివిజన్ అధ్యక్షుడు గిరియాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వై.వెంకటగాంధీ హాజరై స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఎగరవేసి, కేక్‌కట్ చేశారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సురేష్‌నాయుడు, ముక్కాల ప్రసాద్ బాబాయ్, శరత్, సంజీవరెడ్డి, రవీందర్, ఆరే కృష్ణ, కృష్ణారెడ్డి, భ్రమరాంబ, మెల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చంపాపేట డివిజన్‌లో



చంపాపేటలో నిర్వహించిన వేడుకల్లో బైగళ్ల రవీందర్, మెట్టు సంజీవరెడ్డి

చంపాపేట గాంధీ బొమ్మ ఆవరణలో డివిజన్ టీడీపీ అధ్యక్షుడు బైగళ్ల రవీందర్ పార్టీ జెండాను ఎగరవేశారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు మెట్టు సంజీవరెడ్డి, ఆరే కృష్ణ, వేణుబాబు చౌదరి, ఆనంద్‌నాయుడు, పి.వెంకటేష్, రంగమ్మ, లలిత, అలివేలు పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

హయత్‌నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మదర్ డెయిరీ విద్యుత్ సబ్‌స్టేషన్ 11కేవీ విజయనగర్ కాలనీ ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హయత్‌నగర్ విద్యుత్ శాఖ ఏఈ అంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త కనెక్షన్‌ల కోసం లైన్ విస్తరించేందుకు గాను ఉదయం 7 గంటల నుంచి 7.30 గంటల వరకు విజయనగర్ కాలనీ, ప్రగతినగర్ కాలనీ, బృందావన్ కాలనీ, వీరభద్రనగర్ కాలనీతోపాటు చుట్టూ ఉన్న పలు కాలనీలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో..

సంతోష్‌నగర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11కేవీ చైతన్యపురి, సరూర్‌నగర్, జైపురికాలనీ, డెంటల్‌కాలేజ్, శివపురికాలనీ, ప్రజయ్‌నివాస్, స్టేడియం, జైన్‌మందిర్, హనుమాన్‌నగర్, బీరప్ప టెంపుల్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో నూతన సర్వీస్ కనెక్షన్‌ల పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ తెలిపారు. ఉదయం 6.30గంటల నుంచి 9 గంటల వరకు ఆయా ఫీడర్ల పరిధుల్లో అరగంట చొప్పున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్లైవుడ్ గోదాంలో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

హయత్‌నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని ప్లైవుడ్ గోదాం దగ్ధం అయిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తొర్రూర్ గ్రామంలో గీతా ప్లైవుడ్ గోదాం ఉంది. శుక్రవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. దీంతో స్థానికులు హయత్‌నగర్ ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది అక్కడికి వెళ్లి సాయంత్రం వరకు మంటలను పూర్తిగా ఆర్పి వేశారు. అప్పటికే ప్లైవుడ్ సామగ్రి కాలి బూడిద అయింది. దీంతో పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ప్లైవుడ్ గోదాం పక్కనే సీసలు శుభ్రం చేసే పరిశ్రమ ఉంది. దానికి మంటలు అంటుకున్నట్లయితే తీవ్ర ప్రమాదం జరిగి ఉండేదని ఫైర్ అధికారి యాదగిరి తెలిపారు. ఈ విషయమై పోలీసులకు సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తాటిచెట్టుపై నుంచి గీత కార్మికుడు జారి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఓరుగంటి భిక్షపతిగౌడ్ (55) గీత కార్మికుడు. గురువారం సాయంత్రం ఆయన గ్రామ సమీపంలోని తాటివనంలో కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి జారిపడ్డాడు. చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలు కాగా అతన్ని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్సను అందజేస్తున్నట్లు తాజా మాజీ సర్పంచ్ కవాడి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలిప్పిస్తామని మోసం

యూసుఫ్‌గూడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను ఇద్దరు యువకులు మోసం చేశారు. వారి నుంచి రూ.2లక్షలను కాజేశారు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ వాజిద్ అనే యువకుడు వెంగళరావు నగర్‌లోని ఓ హాస్టల్‌లో తన మిత్రులు వినోద్, లక్ష్మణ్‌తో ఉంటూ చదువుకుంటున్నాడు. వీరికి హాస్టల్‌లో ఉన్న పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ప్రవీణ్, అనంతపురం ప్రాంతానికి చెందిన సిద్ధార్థ్‌ను పరిచయం చేశాడు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని, కొంత నగదు చెల్లించాలని సిద్దార్థ్ వారితో చెప్పాడు. దీంతో గత ఏడాది సెప్టెంబర్ 15న వినోద్ రూ. 20వేలు, 21వ తేదీన వాజిద్ రూ.10వేలు ప్రవీణ్‌కు పంపారు. డబ్బు తీసుకొని నకిలీ ఆఫర్ లెటర్లు వారికి అందజేశాడు. వినోద్, లక్ష్మణ్ తరచూ ప్రవీణ్‌కు, సిద్దార్థ్‌కు దాదాపు రూ.2 లక్షల వరకు ఇచ్చారు. డిసెంబర్ వరకు వీరికి ఎలాంటి జాయినింగ్ లెటర్లు ఇవ్వలేదు. దీంతె అనుమానం వచ్చిన స్నేహితులు వారిని నిలదీయగా మాయ మాటలు చెబుతూ మీ డబ్బులు తిరిగి ఇస్తామని నమ్మించారు. పదేపదే డబ్బులు అడగడంతో తమను వేధిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బెదిరించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేయడంతో పాటు మళ్లీ బెదిరింపులకు పాల్పడడంతో బాధితులు వినోద్, లక్ష్మణ్‌లు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.